ప్రజాశక్తి
ఆదివారం 7 సెప్టెంబర్ 2025
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా





9న హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవాలు

● హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ ● విసి డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27వ, 28వ స్నాతకోత్సవం ఈనెల 9వ తేదీ ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. నగరంలోని ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయ ఆవరణంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విసి చంద్రశేఖర్ మాట్లాడుతూ కోవిడ్ వల్ల 2021వ బ్యాచ్‌కి చెందిన 27వ, 2022వ బ్యాచ్‌కి చెందిన 28వ స్నాతకోత్సవం నిర్వహించలేదన్నారు. ఈ నేపథ్యంలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించే ఈ స్నాతకోత్సవాలను రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయ కులపతి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ ప్రదానం చేసే గౌరవ డాక్టరేట్ కోసం ముగ్గురు పేర్లతో గవర్నర్‌కు పంపగా, ఢిల్లీలోని నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఓపీ యాదవను గౌరవ డాక్టరేట్ డిగ్రీకి ఎంపిక చేశారన్నారు. 27వ స్నాతకోత్సవానికి సంబంధించి 53 మంది విద్యార్థులకు, 28వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందించనున్నారన్నారు. యూనివర్శిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్‌కు రూ.75 లక్షల గ్రాంట్ ఇచ్చినట్లు తెలిపారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి మాట్లాడుతూ ఐదుగురికి పిహెచ్‌డి పట్టాలు, సూపర్ స్పెషాలిటీలో ఒకరికీ డిగ్రీ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, జాయింట్ రిజిస్ట్రార్ (అకడమిక్) కే.నీలిమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కే.సుసన్న రామర్స్, ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ ఎమ్.వీ. అక్కిరాజు పాల్గొన్నారు.



స్నాతకోత్సవం బ్రోచర్ ఆవిష్కరణలో విసి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి, డైరెక్టర్ సూర్యప్రభ, జాయిట్ రిజిస్ట్రార్ నీలిమ

చలో...ఉద్రిక్తం

● పోలీసు జులుంతో పలువురికి గాయాలు
● 250 మంది విద్యార్థులు, నేతల అక్రమ అరెస్టు
● వివిధ స్టేషన్లకు తరలింపు
● విద్యార్థులకు సిపిఎం నేతల పరామర్శ





ఆస్పత్రిలో చికిత్స పందుతున్న విద్యార్థునులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శనివారం చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమం పోలీసుల అత్యుత్సాహంతో ఉద్రిక్తంగా మారింది. విద్యార్థులు ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు జులుం ప్రదర్శించారు. పోలీసుల వైఖరితో ఉద్రిక్తత ఏర్పడింది. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విజయవాడ బీసెంట్ రోడ్ నుంచి ధర్నా చౌక్ వరకు వేలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ప్రశాంతంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకుల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారు. వారిపై విరుచుకుపడ్డారు. లాఠీలు ఝుళిపించారు. అత్యుత్సాహంతో విద్యార్థులపై దాడి చేయడంలో పలువురు గాయపడ్డారు. వీరిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు. 250 మందికిపైగా విద్యార్థులను, నేతలను అక్రమంగా అరెస్ట్ చేసి వన్‌టౌన్, అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం తదితర పోలీసుస్టేషన్లకు తరలించారు. సాయంత్రం వరకు వారిని స్టేషన్లోనే ఉంచి ఆ తర్వాత విడుదల చేశారు. పోలీసుస్టేషన్లలో ఉన్న విద్యార్థులను, ఆస్పత్రిలో ఉన్న చికిత్స పొందుతున్న విద్యార్థులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, విఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, నాయకులు చింతల శ్రీనివాస్ తదితరులు పరామర్శించారు.

పోలీసుస్టేషన్లో పరామర్శ..





(ప్రధాన వార్త మెయిన్‌లో)

ఆస్పత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు వి.శ్రీనివాసరావు, సిహెచ్.బాబురావు, డి.వి.కృష్ణ, బి.సత్యబాబు



ఆటో బతుకులు ఫట్టీ

ఆదాయం లేక అష్టకష్టాలు

ప్రజాశక్తి - గన్నవరం : "ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశాం.. తమ జీవితాలల్లో వెలుగులు తెస్తుందస్తుందని ఆశించాం.. ఆ ఆశలు అడియాసలయ్యాయి. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పెట్టిన శ్రీ శక్తి పథకంతో ఉపాధి కోల్పోయిన మా ఆటో కార్మికుల బతుకులు ఫట్టీ కొట్టాయి. ప్రభుత్వం సహాయం చేయకపోగా ఉన్న బతుకుని రోడ్డున పడేసింది. ఉచిత బస్సు పథకం పెట్టక ముందు రోజుకు రూ.1500 నుంచి రూ.1800 సంపాదించేవారం. ఇప్పుడు రోజుకు రూ.300 కూడా రావడం లేదు. రోజు మొత్తం అష్టకష్టాలు పడి ఆటో తోలితే రూ.500 రావడం కష్టంగా మారుతోంది. ఈ డబ్బులతో ఇంట్లో కుటుంబాలను ఏ విధంగా పోషించాలో, ఆటో కిస్తీలు ఎలా కట్టాలో తెలియడం లేదు. మా బతుకులు చితికిపోయాయి. కోలుకోవడం కష్టమే..." ఇదీ కృష్ణాజిల్లా గన్నవరం ప్రాంతంలో ఏ ఆటో కార్మికుడ్ని కదిపినా చెబుతున్న వెతలు.

గన్నవరం పట్టణంలో 200లకు పైగా ఆటోలున్నాయి. గొల్లనపల్లి రూట్లో 20, ముస్తాబాద రూట్లో 12, సూరంపల్లి 15, అజ్జంపూడి 10, బుద్దవరం 7, దావాజీగూడెం - ఉంగుటూరు రూట్లో 12, గన్నవరం - హనుమాన్ జంక్షన్ రూట్లో 120, పెద అవుటపల్లి - తెంపల్లి రూట్లో 22 ఆటోలు తిరుగుతున్నాయి. కొత్త ఆటో ఖరీదు రూ.4 లక్షలు ఉండగా, ఇతర ఖర్చులు కింద రూ.70 వేలు అవుతుంది. మొత్తం రూ.4.70 లక్షల వరకు కొత్త ఆటో కొనుగోలు చేసిన వారికి ఖర్చవుతుంది. ఫైనాన్స్ కింద తీసుకుంటే నూటికి రూపాయిన్నర నుంచి రెండు రూపాయల వడ్డీ కట్టాలి. సగటున నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఆటో కిస్తీ చెల్లించాలి. కుటుంబ ఖర్చుల కింద సుమారు సరాసరిన రోజుకి రూ.700 నుంచి రూ.1000 అవసరమవుతుంది. ఆటో కిస్తీ కింద రోజుకు రూ.500 తీయాలి. గ్యాస్, పెట్రోలు కింద రోజుకు రూ.300 పక్కన పెట్టాలి. ఈ లెక్కన ఒక ఆటో కార్మికుడు రోజుకు రూ.1800 సంపాదిస్తే తన అవసరాలకు సరిపోతుంది. ఉచిత బస్సు పథకం రాకముందు రోజుకు సగటున రూ.1300 నుంచి రూ.1800 వరకు సంపాదించేవారు. ఉచిత బస్సు పథకం పుణ్యమాని ఇప్పుడు ఆదాయం రూ.500 కు పడిపోయింది. ఒక్కో రోజు రూ.300 కూడా రావడం లేదని కార్మికులు చెప్తున్నారు. ఈ లెక్కన ఆటో కిస్తీలు ఎలా కట్టాలని ఆవేదన చెందుతున్నారు. కిస్తీ కట్టకపోతే ఫైనాన్స్ కంపెనీ వారు ఆటో లాక్కుపోతారు. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతుంది. అప్పులు చేద్దామన్న ఇచ్చే నాధుడు ఉండడు. ఎందుకంటే పనిచేసేందుకు ఆటో ఉండదని చెబుతున్నారు. ఆటో కార్మికుల బతుకులు చితికిపోతున్నా ప్రభుత్వం మాత్రం వారిని ఆదుకోవడానికి ముందుకు రావడం లేదు.



ఆటో కార్మికులకు భవిష్యత్తు లేదు
సుభాని, వీరవల్లి



కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టి ఆటో కార్మికుల బతుకులను చిదిమేసింది. ఆటో ఎక్కేది ఎక్కువగా మహిళలే. పెద్దగా చదువుకోకపోవడంతో ఆటో కొనుక్కుని కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాం. నాలుగు లక్షలు ఆటోకు ఖర్చు పెట్టాం. పథకం పెట్టక ముందు రోజుకు రూ.1700 వచ్చేది. ఆ తర్వాత ఆదాయం రూ.300కు పడిపోయింది. ఇలాగైతే ఆటో ఉండదు. మా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు. పథకం పెట్టిన ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవడానికి కనీసం నెలకు రూ.15 వేలు ఇస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

ప్రభుత్వం చావు దెబ్బ కొట్టింది
కొండయ్య, తేలప్రోలు



ఉచిత బస్సు పథకం వల్ల మహిళలంతా బస్సులు ఎక్కుతున్నారు. ఆటో ఎక్కడానికి పెద్దగా ఎవరూ రావడంలేదు. దీంతో మా ఆదాయం పూర్తిగా పడిపోయింది. రోజు మొత్తం మీద రూ.300 ఆదాయం కూడా రావడంలేదు. పెట్రోల్‌కు కూడా ఆ మొతం చాలడంలేదు. ఇంటికి ఒక్క రూపాయి కూడా తీసుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఆటో కిస్తీలకు అప్పులే గతి అయ్యాయి. లేదంటే ఫైనాన్స్ కంపెనీకి అప్పగించాలి. ఈ దుస్థితిలో కార్మికులు ఎలా బతుకుతారు. మా పని అయిపోయింది.

నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

వీక్షించేందుకు గాంధీ హిల్ వద్ద ఏర్పాట్లు

విజయవాడ : చంద్రగహణాన్ని వీక్షించేందుకు విజయవాడ స్కై వాచర్స్, జన విజ్ఞాన వేదిక, గాంధీహిల్ ఫౌండేషన్ ఏర్పాట్లు చేశాయి. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఎరుపు వర్ణంలో చంద్రుడు కనువిందుచేయనున్నాడు. అత్యంత అరుదుగా వచ్చే ఈ ఖగోళ అద్భుతాన్ని రాత్రి 8 గంటల సమయంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు గాంధీ హిల్ వద్ద ఏర్పాట్లు చేశాయి.

19 నుండి అమరావతి ప్రాపర్టీ పెస్టివల్

● నారెడ్కో రాష్ట్ర ఛైర్మన్ గద్దె చక్రధర్ ● ప్రత్యేక కార్యక్రమం, వీడియో ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాజధాని వైభవాన్ని ప్రతిబించేలా అమరావతి ప్రాపర్టీ పెస్టివల్ 2025ను నిర్వహించనున్నట్లు జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి (నారెడ్కో) రాష్ట్ర ఛైర్మన్ గద్దె చక్రధర్ అన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో సొంతింటి కలను నెరవేర్చుకునే శుభతరుణం ఇదేనన్నారు. శనివారం నగరంలోని పార్క్ హయత్‌లో ప్రాపర్టీ ఫెస్టివల్ ప్రారంభ సూచనగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవానికి సంబంధించి అన్ని విశేషాలతో తీర్చిదిద్దిన దృశ్య శ్రవణ ప్రదర్శనను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రధర్, నారెడ్కో సెంట్రల్ జోన్ ఛైర్మన్ సందీప్ మండవ మాట్లాడుతూ ఈనెల 19, 20 ,21 తేదీల్లో ప్రోపర్టీ ఫెస్టివల్‌లో వినియోగదారులకు, అమ్మకం దారులు ప్రత్యేక రాయితీలు అందిస్తున్నా యన్నారు. అర్హతలున్న వారికి బ్యాంకులు సైతం తక్షణ రుణ మంజూరు పత్రాలు అందిస్తాయని వివరించారు. సిఆర్‌డిఎ సైతం ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసి అయా లేఅవుట్‌లు, అపార్ట్ మెంట్ లకు సంబంధించిన వాస్తవ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతుందన్నారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ పరుచూరి మాట్లాడుతూ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే స్థిరాస్తి ఉత్సవాన్ని పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రారంభించనున్నారన్నారు. అరవైకి పైగా ప్రదర్శన సంస్థలు తమ ఉత్పత్తులను ప్రజలకు వివరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి చావా రమేష్, సెంట్రల్ జోన్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ హరిప్రసాద్ రెడ్డి, సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్ వి రమణ, సిఆర్డిఎ ప్రతినిధులు సీతారామయ్య, వాసిరెడ్డి వంశీ, పివి కష్ణ, కోడే జగన్, తదితరులు పాల్గొన్నారు.



దృశ్య శ్రవణ ప్రదర్శన ఆవిష్కరణలో చక్రధర్, సందీప్, కిరణ్, రమేష్, హరిప్రసాద్, రమణ తదితరులు

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షలు అందజేత

విజయవాడ : మరణించిన హోంగార్డు కుటుంబానికి ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆర్థిక సహాయం అందించారు. విజయవాడ నగర హోంగార్డు యూనిట్‌కు చెందిన ఎన్.అర్జునరావు ప్రధాని బందోబస్త్ నిమిత్తం విశాఖపట్నం వెళ్లి విధులు నిర్వహిస్తున్న సమయంలో



గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య వి.లక్ష్మికి సిపి రాజశేఖర బాబు రూ.5 లక్షల చెక్కును కమిషనర్ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈకార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ కె.సుధాకర రెడ్డి పాల్గొన్నారు.

టామెంట్రీ బాక్స్‌లు పంపిణీ

విజయవాడ : విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పిఎం ఎంకే బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు జరిగిన ఎఫ్‌ఎ వన్ ఎగ్జామ్‌లో ఆరవ నుండి పదవ తరగతి వరకు మొదటి పది స్థానాలు సాధించిన మొత్తం 50 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌తో పాటు వారికి ఒక గోల్డెన్ స్టార్ అనే బిరుదుతో కూడిన ఒక ట్యాగ్ను అందించారు. బిగ్ హెల్ప్ ఫౌండేషన్ సాయంతో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ మైనస్ హుస్సేన్, కోఆర్డినేటర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అర్థమెటిక్, స్పీడ్ మాథ్స్‌లో ఉచిత శిక్షణ

విజయవాడ : గవర్నరుపేటలోని ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం అర్థ మెటిక్, స్పీడ్ మాథ్స్‌లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. వివిధ పోటీ పరీక్షలకు ఠాగూర్ గ్రంథాలయ పూర్వ పాఠకుడు డి.శ్రీనివాస్ శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.



ఇంకా బుడమేరు పూడికే తీయని దుస్థితి : సిహెచ్.బాబురావు

ప్రజాశక్తి - విజయవాడ : మరోసారి బుడమేరు ముంపు ప్రమాదం ఉన్నా, పాలకులు పూడికతీత కూడా పూర్తిచేయని దుస్థితిలో ఉన్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు అన్నారు. గత ఏడాది సంభవించిన బుడమేరు ముంపులో మరణించిన కుటుంబాలను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోలేదని విమర్శించారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో బుడమేరు పరివాహక ప్రాంతంలో శనివారం సిపిఎం నేతలు బాబురావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు కె.దుర్గారావు పర్యటించారు. గత సంవత్సరం బుడమేరు వరదల్లో కొట్టుకుపోయి మరణించిన పోలినాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ బుడమేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టి, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం యంత్రాంగం ఇంకా న్యూ రాజరాజేశ్వరి పేటకు వెళ్లే బ్రిడ్జికి ఇరువైపులా తూటి కాడ అడ్డంకులు ఇంకా తొలగిస్తూనే ఉందన్నారు. గత సంవత్సరం బుడమేరు వరదలతో మేటవేసుకుపోయిందని,



ఈ మేటను తొలగించడానికి ఏడాది కాలంలో ఇరిగేషన్ శాఖ ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. దీంతో బుడమేరు లోతు మరింత తగ్గిపోయిందన్నారు. న్యూ రాజరాజేశ్వరి పేట నుండి రాఘవేంద్ర థియేటర్ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ కింద ఎనిమిది ఖానాలు ఉన్నా, ఐదారు ఖానాలు పూర్తిగా వ్యర్థపదార్థాలతో నిండిపోయాయన్నారు. బుడమేరు వరదల్లో మరణించిన 50 కుటుంబాలు అనాథలుగా మారినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈకార్యక్రమం లో సిపిఎం నేతలు టి.శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, పీర్ సాహెబ్, వెంకటరెడ్డి, అప్పన్న, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉన్న ఎరువులు

విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో శనివారం రాత్రి 8 గంటల సమయానికి అందుబాటులో ఉన్న యూరియా నిల్వలను అధికారులు ప్రకటించారు. అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం... ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ఇప్పటివరకు మొత్తం 58,513 టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశారు. ప్రస్తుతం జిల్లాలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలిలా ఉన్నాయి.

ఎరువులు	టన్నుల్లో
యూరియా	5,546
డీఏపీ	1,393
ఎంవోపీ	0,942
ఎన్‌పీకే	11,627
ఎస్ఎస్‌పీ	2,045
మొత్తం	21,554

పరిటాలలో ఉద్రిక్తత

●ఇద్దరికి గాయాలు●రోడ్డుపై బైఠాయింపు

ప్రజాశక్తి - కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాలలో వినాయక నిమజ్జనం సందర్భంగా జరిగిన ఊరేగింపులో రెండు మతాలకు చెందిన కొందరి మధ్య వివాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... పరిటాలలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని ఊరేగింపు శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ఊరేగింపు దళితవాడ మీదుగా వస్తుండగా... తమ ఇళ్ల వైపు రావొద్దని కొందరు అభ్యంతరం తెలపడంతో వివాదం చెలరేగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు బందోబస్తు మధ్య దళితవాడ మీదుగా వెళుతుండగా, కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసరడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకుంది. రాళ్లు ఎవరువేశారో అర్థం కాకపోవడంతో ఊరేగింపులో పాల్గొన్న వారంతా వినాయకుని విగ్రహంతో సహా ఆందోళనగా పరిటాల సెంటర్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. సాయంత్రం 5.45 గంటల నుండి 9 గంటల వరకు నిరసన కొనసాగింది. మహిళలు కూడా పెద్దసంఖ్యలో నిరసన తెలిపారు. దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. చర్యలు తీసుకునే వరకూ ఆందోళన కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. నందిగామ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పిట్టల శ్రీదేవి, బిజెపి కంచికచర్ల మండల అధ్యక్షుడు కాలవ మహేష్ తదితరులు అక్కడికి చేరుకున్నారు. డిసిపి విగ్నేశ్వరరాజు, నందిగామ ఏసిపి కేబీజీ తిలక్, నందిగామ రూరల్ సిఐ డి చవాన్, కంచికచర్ల ఎస్సై విశ్వనాథ్ తదితరులు వచ్చి నిరసనకారులతో చర్చలు జరిపారు. ట్రాఫిక్‌ను వేరే మార్గాల మీదుగా మళ్ళించారు. దాడిలో గాయపడిన ఇద్దరిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దాడికి పాల్పడిన వారిని 24 గంటల్లో అరెస్టు చేస్తామని, దాడులు పునరావృతం కాకుండా



పోలీసు పికెట్ ఏర్పాటు చేస్తామని ఏసిపి తిలక్ హామీ ఇవ్వడంతో నిరసనకారులు తమ ఆందోళనను విరమించారు.



సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

విజయవాడ : ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతర్ చేసిన ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సస్పెండ్ చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. విజయవాడకు చెందిన బొగ్గవరపు నరసింహ కుమార్, మరో అయిదుగురు వ్యక్తులు కలిసి విజేత ఇండస్ట్రీస్ ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలం భీమవరంలో భూమి రిజిస్ట్రేషన్లో అవకతవకలు జరిగాయి. ఆ సంస్థ మేనేజింగ్ పార్టనర్ గోనుగుంట్ల లక్ష్మణ్ కుమార్ మరణించడంతో ఆయన సోదరి పులిపాటి లక్ష్మి సుకన్య పేరుతో బంధువులు అన్ రిజిస్టర్డ్ వీలునామా సృష్టించారు. దీనిపై విజయవాడ సబ్ కలెక్టర్‌కు కంపెనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దీంతో సబ్ కలెక్టర్...లక్ష్మి సుకన్య పేరుతో జారీచేసిన పట్టాదారు పాస్ పుస్తకాన్ని రద్దు చేయాలని ఆదేశించారు. అయితే సబ్ కలెక్టర్ ఆదేశాలను అమలు చేయకుండా ఆ ఆస్తిని సబ్ రిజిస్ట్రార్ రిజిస్టర్ చేశారు. దీనిపై పిఆర్‌జిఎస్‌లో వచ్చిన ఫిర్యాదుతో కలెక్టర్ లక్ష్మీశ విచారణ జరిపించారు. వాస్తవమని తేలడంతో రిజిస్టర్ చేసిన అప్పటి జగ్గయ్యపేట ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్, ఇప్పటి సీనియర్ అసిస్టెంట్ వి.రామకష్ణను సస్పెండ్ చేస్తూ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ (స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్) ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపిని కలిసిన బార్ పాలకవర్గం

విజయవాడ : బెజవాడ బార్ అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు శనివారం విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బిబిఎ అధ్యక్షులు ఏకే భాషా, ఉపాధ్యక్షులు పిల్లా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి జి వరహ లక్ష్మి, సీనియర్ న్యాయవాది మతిన్, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్ తదితరులు ఎంపిని కలిసిన వారిలో ఉన్నారు. బెజవాడ అసోసియేషన్ భవనం ఆధునీకరణకు సాయం అందించాలని కోరారు.

అలరించిన 'మహి స్వరాలు'

విజయవాడ : 'మహి స్వరాలు' సినీ సంగీత విభావరి అలరించింది. శనివారం సాయంత్రం గాంధీనగర్ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో సంస్థ పద్నాలుగో సీజన్ నిర్వహించారు. సింగర్, యాంకర్ మహేశ్వరి (మహి) నిర్వహణలో గాయనీ గాయకులు లక్ష్మణ్ నాయక్, రాజా, రాజేష్, నాగార్జున, కారుమంచి రాజు, రాము, భవానీ శంకర్ శర్మ, లక్ష్మణ్, మేకప్ రాజు, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, స్టాలోన్ కింగ్, రాధా నాయుడు, మౌనిక, రాజేశ్వరి పలు సినీ సోలో, డ్యూయెట్ గేయాలను వీనుల విందుగా ఆలపించారు.

నేడు మంచినీటి సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవలేరు గ్రామపంచాయతీ ఏరియాలో ఈనెల 7వ తేదీ ఆదివారం రక్షిత మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు శనివారం తెలిపారు. మెయిన్ మంచినీటి ట్యాంకు వద్ద గల పైపులు తుప్పు పట్టినందున వాటి స్థానంలో నూతన పైపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కావున గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : కంటి ఆరోగ్యం కోసం పిల్లల దృష్టిలోపాలు, ఇతర కంటి సంబంధిత పరిస్థితులను ముందుగా గుర్తించాలని వీరవల్లి పీహెచ్‌సి ఆప్తమాలజిస్ట్ డాక్టర్ కొండలరావు అన్నారు. మండలంలోని పొట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్ర ప్రదేశ్ నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్నెస్ కార్యక్రమం లో భాగంగా శనివారం పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండలరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 6 నుండి 12 లేదా అంతకంటే ఎక్కువ వయసున్న లోప భూయిష్ట దృష్టి ఉన్న పిల్లలకు ఉచిత కళ్లజోళ్ళు అందిస్తున్నామని తెలిపారు. ఈ పాఠశాలలో 83 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించగా 11 మంది పిల్లలకు కళ్లజోళ్ళు అవసరమని నిర్ధారించామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు జి కృష్ణ, హెల్త్ సూపర్వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యా యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మనోహరమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మాజీ ఎంపీపీ, పెదప్రోలు సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు మాతృమూర్తి మనోహరమ్మ దశదిన ఖర్మ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, రావి నాగేశ్వరరావు, కర్రా సుధాకర్,చందన రంగారావు, దిడ్ల జానకి రాంబాబు, కొల్లూరి ఇమ్మనియేలు తదితరులు పాల్గొన్నారు



యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

యూరియా పంపిణీలో హైడ్రామా

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని మంగళాపురం పిఏసిఎస్ వద్ద యూరియా పంపిణీలో హైడ్రామా నడిచింది. యూరియా లోడు మాదికాదంటూ తిప్పి పంపే ప్రయత్నాన్ని రైతులు అడ్డుకున్నారు. యూరియా కోసం శనివారం ఉదయం నుంచి పిఏసిఎస్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు యూరియా లారీ రాగానే ఆనందం వ్యక్తం చేశారు. అయితే అది గ్రోమోర్ కంపెనీ యూరియా అని తమది కాదని అది పెదకళ్లేపల్లి వెళ్లాల్సినదని ఒకసారి, మాజేరు వెళ్లాల్సిందని మరోసారి చెప్పి పిఏసిఎస్ వారు ఆ లారీని తిప్పి పంపేందుకు సిద్ధమయ్యారు. వచ్చిన లారీని తిప్పిపంటమేమిటని రైతులు ఆగ్రహించి అడ్డుపడ్డారు. ఉదయం గం. 10.30 లకు వచ్చిన యూరియా లోడును మధ్యాహ్నం గం.12ల వరకూ దించకుండా అలాగే అట్టే పెట్టారు. రైతులు ఉన్నతాధికారులకు ఫోన్ చేయటంతో లోడు మంగళాపురానికే పంపామని చెప్పడంతో ఒంటిగంటన్నరకు లోడు దించి రైతులకు ఒక్కొక్క బస్తా అందించారు. అయితే పిఏసిఎస్ అధికారులు మాత్రం వచ్చిన యూరియా లోడు తమది కాదని లారీని తిప్పిపంపుతామని చెప్పటం వెనుక అంతర్యమేమిటోనని రైతులు మండిపడుతున్నారు. మొదటి విడతలో కూడా ఇలాగే చెప్పి రైతులు అందరూ వెళ్ళిపోయిన తరువాత తమకు కావాల్సిన వారికి యూరియా పంపిణీ చేసుకుని తరువాత వచ్చిన వారికి స్టాకు అయిపోయిందని చెప్పి తిప్పి పంపారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

నిరంతరం యూరియా సరఫరా : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని రైతులలో నమ్మకం పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి యూరియా సరఫరాపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా



కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరా నిరంతరం కొనసాగేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ విషయమై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించి వారిలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. మన గ్రోమోర్ కేంద్రాల నుండి వీలైనంత వరకు యూరియాను గ్రామాలకు తీసుకొని వెళ్లి అక్కడి రైతులకు పంపిణీ సాఫీగా చేయాలని ఆదేశించారు. యూరియా ఒకే చోట ఎక్కువగా పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలో ఉన్న గ్రామాలన్నిటికీ ఒకే చోట ఇవ్వడం వలన పెద్దగా రైతులందరూ గుమికూడి బారులుగా ఉంటున్నారని, అలా కాకుండా గ్రామాలకు వెళ్లి రైతులకు సజావుగా పంపిణీ చేయాలన్నారు. ఇందుకోసం సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్లో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజరు మురళీ కిషోర్, తదితర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు .

ప్రతి గ్రామంలోనూ జ్వరాలపై సర్వే చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఆదేశాల ప్రకారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ చంద్ శనివారం ప్రభుత్వ ఆసుపత్రిని విజిట్ చేశారు. ఫీవర్లపై గన్నవరం, ఉంగుటూరు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పీహెచ్ సి ముస్తాబాద్ మెడికల్ ఆఫీసర్ డా. శ్రీ హర్ష, పీహెచ్ సి ఆత్కూరు మెడికల్ ఆఫీసర్ డా. జీతేందర్, పీహెచ్ సి పెదఅవుటుపల్లి మెడికల్ ఆఫీసర్ డా. సుజీత, అలాగే గన్నవరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. శ్రీదేవి పాల్గొన్నారు. గ్రామాల్లో జ్వరాల రోగులు పెరుగుతున్నారని, ఆసుపత్రులకు అధికంగా చికిత్సల కోసం వస్తున్నారని వైద్యులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ్ చంద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఇంటింటికి



వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ ప్రేమ్‌చంద్

వెళ్లి జ్వరం సర్వే , ఎడీస్ దోమల లార్వా సర్వే చేయాలని ఆదేశించారు. ప్రతి జ్వరం కేసుకు మలేరియా రాపిడ్ టెస్ట్, డెంగీ రాపిడ్ టెస్ట్ చేయాలని సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా ప్రతి గ్రామంలో దోమల నివారణ చర్యలు చేపట్టడం, పరిసరాల పరిశు భ్రత పాటించడం కోసం పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

సచివాలయ ఉద్యోగుల విధుల బహిష్కరణ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యకు కారణం అవుతున్న వాలంటీర్ విధులను బహిష్కరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శనివారం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులందరు వాట్సాప్ సర్వీస్ రిజిస్ట్రేషన్ విధులు నిర్వహించాలని ఆదేశించడంతో ఉద్యోగు లందరూ రిజిస్ట్రేషన్ విధులు ముకుమ్మడిగా బహిష్కరించినట్లు సంఘ జిల్లా జెఏసి నాయకులు కిరణ్ కుమార్, అబ్దుల్ ఆరిఫ్, శ్రీనివాస్‌లు తెలిపారు. ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. గతంలో వాలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లకు మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికీ తిరిగే విధులు అప్పగిస్తున్న తీరుకు నిరసనగా శనివారం వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పలువురు మండల పరిషత్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్ లకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు శ్రీనివాస్, ఏడుకొండలు, శివరాం, రాజు అశోక్ ఉన్నారు.




'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పోస్టర్‌ను మచిలీపట్నం వైఎస్ఆర్‌సీపీ కార్యాల యంలో ఇంచార్జి పేర్ని కిట్టు, అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, పెడన ఇంచార్జ్ ఉప్పాల రాము శనివారం ఆవిష్కరించారు. యూరియా కొరతపై రైతులు, రైతు సానుభూతి పరులు, పార్టీ నేతలు ఈ నెల 9వ తారీఖున అన్నదాత పోరు కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపు ఇచ్చారు. సమస్యను ఆర్డీవో దృష్టికి శాంతియుతంగా తీసుకెళ్తామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అవనిగడ్డ వైసిపి సమన్వయకర్త సింహాద్రి రమేష్ మాట్లాడుతూ సీఎం స్థాయి వ్యక్తి వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం సబబు కాదన్నారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చి చంద్ర బాబు వ్యవసాయాన్ని పూర్తిగా మర్చిపోయాడన్నారు. స్థానిక నేతలు, డివిజన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్యుని పనులుడాక్టర్ సి.ఎల్ వెంకటరావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులోని జన్మభూమి మెడికల్ క్యాంపులో శనివారం వందలాది మంది రోగులకు వివిధ రుగ్మతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ వారి వైద్యులు రోగులకు దంత వైద్య పరీక్షలు చేశారు. విజయవాడ సిటిజెన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి వైద్యులు రోగులకు గుండె పరీక్షలు చేశారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేపట్టారు. అలాగే ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్ వారు, హెూమియో వైద్యులు, ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు తమ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించనున్నారని డాక్టర్ సి ఎల్ వెంకటరావు పేర్కొన్నారు.



భారత్‌పై సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - గుడివాడ: భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన 50 శాతం దిగుమతి సుంకాలకు నిరసనగా వామపక్షాల పిలుపు మేరకు స్థానిక మార్కెట్ యార్డు వద్ద సిపిఎం, సీపీఐ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపియం గుడివాడ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, సిపిఐ పట్టణ



కంకిపాడులో ఆందోళన చేస్తున్న దృశ్యం

నాయకులు సి.హెచ్. సత్యనారాయణ, సిపియం పట్టణ నాయకులు రజని, సురేంద్ర, శ్రీనివాసు, అప్పలనాయుడు , కార్మికనాయకులు, డి. నరసింహ రావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంకిపాడు : భారతదేశంపై అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వ్యతిరేకిస్తూ వాటిని రద్దు చేయాలని కోరుతూ కంకిపాడు ప్రధాన రహదారి వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సుంకాలు రద్దు చేయాలని, చంద్రబాబు, జగన్ మోహన్, పవన్ కళ్యాణ్ లు కేంద్రం పైన ఒత్తిడి తేవాలని, అమెరికన్ సామ్రాజ్యవాదం విధానాలు నశించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, సిపిఐ నాయకులు మోతు కూరి అరుణ కుమార్, కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం కార్యదర్శి రౌతు రాంబాబు, నియోజక వర్గ సిపిఐ సహాయ కార్యదర్శి బండి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత ఏడుకొండలుకు సాహితీ సత్కారం

ప్రజాశక్తిలి-కలక్టరేట్ (కృష్ణా) : డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూ జోత్సవం సందర్భంగా మచిలీపట్నంకి చెందిన యువ రచయిత కళ్ళేపల్లి ఏడుకొండలను కృష్ణాజిల్లా రచయితల సంఘం, మండలి వెంకటకృష్ణారావు శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కారించారు. శుక్రవారం విజయవాడలోని రామ మోహన గ్రంథాలయంలో కృష్ణాజిల్లా రచయితల సంఘం, మండలి వెంకటకృష్ణారావు శతజయంతి కమిటీ ఆధ్వర్యంలో మండలి బుద్ధ ప్రసాద్ చేతులు మీదుగా సాహితీ సత్కారం జరిగింది. ఈ కార్య క్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి వియన్నారావు , కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు , జీవి పూర్ణచంద్ , కెసిపి గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ఏచూరి లేని లోటు తీర్చలేనిది

- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు

ప్రజాశక్తి-మైలవరం

నమ్మిన సిద్ధాంతాల కోసం చివరివరకు పోరాడిన ఏచూరి అందరికీ ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు అన్నారు. నేడు దేశంలో జరుగుతున్న విచ్ఛిన్నకర రాజకీయ పరిస్థితులలో సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ ఏచూరి లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి వారోత్సవాలలో భాగంగా సిపిఎం మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ప్రపంచ శాంతిని, మానవతా విలువలను పెంచి పోషించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలకపాత్ర వహించారని తెలిపారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతల నేపథ్యంలో సోషలిజమే ప్రత్యామ్నాయం తప్ప మరొకటిలేదని, ఆ దిశగా సిపిఎం పోరాటాలు చేస్తూ ప్రజల చైతన్య పరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావూరి రమేష్, ఎస్ ఇసాక్, ఆర్ సుబ్బారావు, పాల్గొన్నారు.



ప్రతిభకు పురస్కారం

ప్రజాశక్తి-గంపలగూడెం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక తోటమూలలో ఉన్న గాయత్రి విద్యా సంస్థ యాజమాన్యం వివిధ కళారూపాలలో ప్రతిభను కనబరిచిన ఇద్దరిని ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన నేపథ్యంలో యాజమాన్యం శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసింది. అందుకున్న వారిలో కంచి శ్రీనివాసరావు, జంగం శ్రీనివాసరావు ఉన్నారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వై.లక్ష్మణరావు సతీసమేతంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం శీనా నాయక్ తన ఛాంబర్‌లో న్యాయమూర్తికి దేవస్థానంలో జరుగనున్న దసరా-2025 ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని, శ అమ్మవారి చిత్ర పటాన్ని న్యాయమూర్తికి అందజేశారు.

చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానించాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

చదువును, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు కదలాలని, అప్పుడే ఇంగ్లీషు వ్యామోహం పోతుందని, తద్వారా మన మాతృభాషను పరిరక్షించుకుని, ముందుతరాలకు సగర్వంగా అందించడం సాధ్యమౌతుందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు తెలిపారు. ఆచార్య తూమాటి దొణ తిమ్మరాయ చౌదరి (దొణప్ప) 'శతజయంతి' సందర్భంగా... ఆయన 30వ వర్ధంతిని పురస్కరించుకుని విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో విశిష్ట తెలుగు దిగ్దర్శనం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ పుస్తక రూపకర్తలైన చెన్నపురి తెలుగు అకాడమీ సభ్యులు తూమాటి సంజీవరావు, తిరునగరి భాస్కర్‌లకు, పుస్తకంలోని వ్యాసాలు అందించిన రచయితలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు మలినేని రాజయ్య, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలుగు సాహితీవేత్త సూరం శ్రీనివాసులు సహా తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ మన జీవన విధానంలో మాతృభాష ఆయువు పట్టు వంటిదని అన్నారు. జానపద సాహిత్యం మొదలుకొని... తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర విభాగాల్లో దొణప్ప చేసిన కృషి మహోన్నతమైనదని తెలిపారు. నేటి విశ్వవిద్యాలయాలు, తెలుగు శాఖలు ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవలసిన అవసరముందని పేర్కొన్నారు. ఎంతో మంది మహనీయుల కృషి ఫలితంగా... భారత ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చినా, తెలుగు వెలుగులు భావితరాలకు అందకపోవడం విచారకరమన్నారు. ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందేందుకు తెలుగు వారంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



తెలుగు దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరించిన వెంకయ్య నాయుడు

ఘనంగా ఓనం వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విద్యార్థులు భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించే దిశగా అడుగులు వేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధర్ అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఓనం వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో కేరళ సంప్రదాయ నత్యాలను ప్రదర్శించి సందడి చేశారు. విద్యార్థినులు కేరళ సంప్రదాయ నత్యమైన తిరువాతిర నృత్యాన్ని ప్రదర్శించారు. కళాశాల కార్యదర్శి అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యత, వారసత్వం, సంప్రదాయ విలువల పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శరవణ కుమార్ పర్యవేక్షించారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షులు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అక్రమ అరెస్టులకు ఖండన

ప్రజాశక్తి - విజయవాడసిటీ



విజయవాడ ధర్నా చౌక్‌లో విద్యార్థుల సమస్యలపై ధర్నా చేస్తున్న 40 మంది విద్యార్థులను అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడాన్ని సిపిఎం పశ్చిమ నగర్ కమిటీ తీవ్రంగా ఖండించింది. విద్యార్థులను శనివారం సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరిన విద్యార్థులను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం అన్యాయమన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాల మెరుగుదల, నూతన విద్యా విధానం రద్దుతోపాటు ప్రతి నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ ఏర్పాటు, అందరికీ తల్లికి వందనం అమలు వంటి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సిఐటియు నగర అధ్యక్షులు జి వెంకట్రావు, యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

'గౌతమ్'లో టీచర్స్ డే వేడుకలు

- ఉత్తమ గురుబ్రహ్మ అవార్డు అందుకున్న స్కూల్ కరస్పాండెంట్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

చిట్టినగర్ శ్రీ గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎన్ సూర్యారావు మాస్టర్ ఉత్తమ గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, లైన్స్ క్లబ్ స్మైల్ ప్రతినిధులు శనివారం చిట్టినగర్‌లోని గౌతమ్ క్యాంపస్లో సూర్యారావు మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న వెస్ట్ ఎంఎల్ఎ ఆఫీస్ కార్యదర్శి శ్రీధర్, నగరాల సీతారామయ్య దేవస్థానం అధ్యక్షులు లింగపల్లి అప్పారావు, బిజెపి ఓబీసీ మోర్చా కోశాధికారి బలివడ శివకుమార్ పట్నాయక్, తదితరులు గౌతమ్ విద్యాసంస్థల అభ్యున్నతికి సూర్యారావు మాస్టర్ అందిస్తున్న సేవలు ప్రశంసించారు. అనంతరం గౌతమ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ తులసి, ఉపాధ్యాయులు శ్రీరామ్, మధులత, సునీత, ఉమా, రేష్మ, పూర్ణిమ, దేవకి తదితరులు ఆత్మీయ సత్కారం అందజేశారు.



సూర్యారావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - తిరువూరు

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రోగ్రాంలో భాగంగా జిల్లా ఆర్ బిఎస్ కె కార్యక్రమ అధికారి డాక్టర్ మాధవి తిరువూరు మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న లేబర్ రూము, లేబరేటరీ, టాయిలెట్స్, మందుల రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. ఆసుపత్రి పరిధిలో ఉన్న హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ ఎంఎల్ హెచ్ లను టీసీ నిర్వహించి వారి యొక్క సర్వీసులను రివ్యూ చేశారు. అనంతరం చింతలపాడు హెల్త్ అండ్ వెలనెస్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేసి తగు సూచనలు ఇచ్చారు ఈకార్యక్రమంలో సూపర్వైజర్లు ఆశాభి, మధుసూదన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- తిరువూరు

కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ కె.మాధురి స్పష్టం చేశారు. తిరువూరు మండలం వావిలాల, మునుకుళ్ళ సొసైటీలను ఆమె పోలీసులతో కలిసి శనివారం తనిఖీ చేశారు. సొసైటీల నుంచి రైతులకు పంపిణీ చేస్తున్న యూరియాను పరిశీలించారు. యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని, అందుకు తగు చర్యలు తీసువాలని సొసైటి కార్యదర్శులను ఆదేశించారు.

బూడిద తరలింపు ఆపాలని ఆందోళన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ నిర్వహణలో ఉన్న బూడిద, చెరువులోని బూడిదను అమ్ముకోవడానికి ఎన్‌టిటిపిఎస్ యాజమాన్యం బూడిద కాంట్రాక్టును బడా సంస్థలకు అప్పజెప్పడాన్ని నిరసిస్తూ బూడిద స్థానిక లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బూడిద చెరువు వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికుల నోట్లో బూడిద కొట్టి, వీటీపీఎస్ యాజమాన్యం మాత్రం బూడిదను సొమ్ము చేసుకుంటుందని తెలిపారు. విటిపిఎస్ నిర్మాణం చేపట్టినప్పుడు ప్రజాభిప్రాయ సేకరణలో ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా ఇస్తామన్న బూడిదను ఇప్పుడు అమ్ముకోవడానికి సిద్ధపడ్డ విటిపిఎస్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా బూడిద కాలుష్య ప్రభావిత గ్రామాలైన ఇబ్రహీంపట్నం, కొండపల్లి, ఈలప్రోలు, గుంటుపల్లి, తుమ్మలపాలెం, కిలేశపురం, జూపూడి, మూలపాడు గ్రామాలకు ఉచితంగా బూడిదను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బూడిద తోలకంపై ఆధారపడి ఉన్న 400 లారీలు వెయ్యి కుటుంబాలను నడిరోడ్డు మీదకు నెట్టి వీటిపిఎస్ యాజమాన్యం చేస్తున్న వైఖరికి నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న స్థానిక లారీ ఓనర్స్ యూనియన్ నేతలు

ప్రభుత్వ విధానాలను ఎండగడతాం : వైసిపి

ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వైసీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నల్లగట్ల స్వామిదాస్ ఆరోపించారు. తిరువూరు వైసిపి కార్యాలయంలో ఆయన శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో యూరియా, విత్తనాలను ఆర్బికే, సొసైటీల ద్వారా అందించామని, ఎన్నడూ ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎరువులు సరఫరా చేయలేక రైతులను ఇబ్బందులు గురిచేస్తుందని విమర్శించారు. రైతులు క్యూలైన్‌లో నిలబడి సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితులు కూటమి ప్రభుత్వంలో కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడతామని అన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- రోగులతో ఆసుపత్రులు కిటకిట
- గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం
- దోమల నియంత్రణకు స్థానికుల వినతి

ప్రజాశక్తి-గన్నవరం : వాతావరణంలో వచ్చిన మార్పులతో, ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు సమస్య పెరిగి దోమలు అధికమవడంతో పల్లెల్లో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. టైఫాయిడ్ లక్షణాలతో పిల్లల నుంచి పెద్దోళ్ళ వరకు బాధపడుతున్నారు. వృద్ధుల అవస్థలు వర్ణాతీతంగా ఉన్నాయి. ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది. విష జ్వరాలతో జనాలు అవస్థలు పడుతున్నా, పట్టినా పట్టించుకునే నాధుడు లేరని రోగులు వాపోతున్నారు.

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు కిటకిటలాడుతున్నారు. ఓపి రోజుకు 300 కు పెరిగింది. టైఫాయిడ్ లక్షణాలు కనిపించడంతో వారికి వార్డులో పెట్టి చికిత్సలు చేస్తున్నారు. ముఖ్యంగా జ్వరం, వాంతులు, కీళ్ల నొప్పులు వంటి రకాల లక్షణాలతో పాటు టైఫాయిడ్ రావడంతో కంగారు పడుతున్నారు. విష జ్వరాలు గన్నవరం, వీరపనేనిగూడెం, తెంపల్లి, కేసరపల్లి, ముస్తాబాద్, అల్లాపురం, బుద్ధవరం, విఎన్పురం, కొత్తగూడెం, చనుపల్లివారిగూడెం, జక్కుల నెక్కలం, అజ్జంపూడి గ్రామాల్లో అధికంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

విజృంభిస్తున్న దోమలు

వానలకు తోడు పారిశుధ్య పనులు చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా జనాలపై దాడులు చేసి రోగాలు వ్యాపింపజేస్తున్నాయని, ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నామని ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలో దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేయడం లేదు. దోమల ఉత్పత్తి పెరిగిపోతోంది. ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండడం లేదని వాదన ఉంది. దోమలపై దండయాత్ర చేయడం లేదు. ఎందుకంటే పంచాయతీల్లో నిధులు నిండుకున్నాయని అధికా రులు చెబుతున్నారు. గత 10 రోజులుగా పల్లెలో విషజ్వరాల రోగుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ఆర్ఎంపి, ప్రవేటు ఆసుపత్రులు రోగులతో నిండిపోయాయి. చిన్న పిల్లలు అల్లాడుతున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలల్లో బిల్లు

ఇదే అదునుగా భావించిన ప్రవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ పెరిగింది. రోగి ఆసుపత్రికి వెళితే రూ. 5 వేల నుండి రూ.20 వేలు బిల్లు అవ్వకుండా బయటకు పంపడం లేదని రోగులు చెబుతున్నారు. ముస్తాబాద్, పెద్ద అవుటపల్లి, ఆత్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లోనూ జ్వరాలతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలోని వైద్యులు రోగులకు కొంతవరకు చికిత్సలు అందిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రంగంలోకి దిగి పల్లెలో విష జ్వరాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా మెడికల్ క్యాంపులు పెట్టి రోగులకు చికిత్సలు అందించాలని జనాలు కోరుతున్నారు.

ఆసుపత్రుల్లో పెరుగుతున్న ఓపి

– గన్నవరం మండలంలో ఒక సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. రోజుకు 300 ఓ.పి ఉంటుంది. 20 నుంచి 30 మంది ఇన్ పేషెంట్లుగా ఉంటున్నారు. నలుగురు వైద్యులు సేవలందిస్తున్నారు.

– ముస్తాబాద ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ఒపి వంద నుంచి 150 వరకు ఉంటుంది. డాక్టర్ హర్ష ఆధ్వర్యంలో రోగులకు సేవలు అందిస్తున్నారు.

– అదేవిధంగా ఆత్కూరు, పెద ఆవుటపల్లి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సంఖ్య పెరుగుతుంది. ఆస్పత్రిల్లో ఇద్దరు డాక్టర్లు ఉండి సేవలందిస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో కిటకిటలాడుతున్న రోగులు

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు పెట్టాలి : సిపిఎం

విష జ్వరాలు, టైఫాయిడ్, లక్షణాలతో అల్లాడుతున్న ప్రజలను రక్షించడానికి ప్రభుత్వం వెంటనే మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. నెల రోజులుగా పల్లెల్లో చాలా గహాల్లో రోగులు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గన్నవరం, కేసరపల్లి, చను పల్లివారిగూడెం, ముస్తాబాద గ్రామాల్లో జ్వ రాల బాధితులు అధికంగా ఉన్నారన్నారు. టైఫాయిడ్ లక్షణాలతో అందరూ భయపడుతున్నారని చెప్పారు. ప్రవేట్ ఆసుపత్రికి వెళితేజేబులు ఖాళీ చేస్తున్నారన్నారు. దోమల నిర్మూలనకు పంచాయతీల్లో చర్యలు తీసుకోవడం లేదన్నారు. పంచాయతీ అధికారులు దోమల నిర్మూలనకు ముందు పిచికారి చేయాలన్నారు.

దివిసీమ ప్రగతిలో మండలి కృష్ణారావు పాత్ర చిరస్మరణీయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ అభివృద్ధిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు పాత్ర చిరస్మరణీయమని ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ అన్నారు. శనివారం సెంటర్లో ఎంవి కష్ణారావు శత జయంతి సందర్భంగా కృష్ణారావు విగ్రహానికి నియోజకవర్గ కూటమి పార్టీల మహిళా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకదుర్గ మాట్లాడుతూ వెంకట కృష్ణారావు ఉమ్మడి రాష్ట్రంలో అనేక శాఖలకు మంత్రిగా తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో రాష్ట్ర అభివద్ధికి, దివిసీమను అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. మండలి వెంకటకృష్ణారావు శతజయంతి కమిటీ అవనిగడ్డ గాంధీ క్షేత్రం మండల అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మతి శ్రీనివాసరావు, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, స్టేట్ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ పాల్గొన్నారు

శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుడివాడ : శ్రీ అమ్మవారి ఆశీస్సులతో వాడ వాడల వైభవోపేతంగా శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు జరగాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో గుడివాడలో ప్రసిద్ధిగాంచిన శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవాలయంలో జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే రాము శనివారం ఉదయం ఆవిష్కరించారు. అనంతరం వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో జరగనున్న నవరాత్రి మహోత్సవాల ఏర్పాట్లను ఈవో కందుల గోపాలరావు ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, వేద పండితులు, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను ఉపయోగించుకోవాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-పామర్రు : యువతకు ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధి కురుమద్దాలిలో శనివారం జరిగిన జాబ్‌మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని విద్యార్హతలు ఉండి ప్రోత్సాహం లేని యువతను ఎంపిక చేసుకుని వివిధ శాఖల సమన్వయంతో నిరుద్యోగ యువతకు దిశా దశ నిర్దేశిస్తున్నామన్నారు. జాబ్‌మేళాను యువత వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జాబ్ మేళాలో పాల్గొన్న వివిధ కంపెనీలకు ఆయన కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, చాట్ల పెద్ద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : బాలల రక్షణ చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కృష్ణా జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్‌లో బాలల న్యాయం, పిల్లల రక్షణ చట్టాల అమలులో సమస్యలు, సవాళ్లు మొదలగు అంశాలపై నిర్వహించిన సమావేశానికి ఇన్చార్జి చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.బాబునాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకష్ణయ్యలు హాజరై వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. బాల్య వివాహాలు, పిల్లల ఆరోగ్యం, విద్య పునరావాసం, ప్రభుత్వ పథకాలు, దూరప్రాంతాల పిల్లల సదుపాయాలు మొదలగు అంశాలపై చర్చించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు.



పోలీస్ శాఖలోకి నూతన జాగిలం 'విక్టర్' రాక

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా పోలీస్ శాఖలోకి కొత్త జాగిలం చేరికతో దర్యాప్తు మరింత శక్తివంతమవుతుందని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు తెలిపారు. నూతన జాగిలం 'విక్టర్' ను ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతి కతతో పాటు శిక్షణ పొందిన నూతన జాగిలం చేరికతో జిల్లా పోలీస్ విభాగం దర్యాప్తు సామర్థ్యం పెరిగిందని, దీని ద్వారా దర్యాప్తు, నేర పరిశోధన నేరస్తులను పట్టుకోవడం మరింత సులభం అవుతుందన్నారు. కష్ణాజిల్లా పోలీస్ శాఖలో 2 లక్షణాలు ఒకే జాగిలంలో కలిగి ఉన్న డాగ్ ఇదే ప్రథమం అన్నారు. 11 నెలల శిక్షణా కాలం ముగించుకొని శిక్షణాకాలంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు.

నేడు ఆలయం మూసివేత

ప్రజాశక్తి-మోపిదేవి : చంద్రగ్రహణం కారణంగా మోపిదేవి శ్రీ శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ఈనెల 7న మూసివేస్తున్నట్లు ఆలయ అధికారి దాసరి శ్రీరాం వరప్రసాద్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి ఆలయ మూసివేసి మరుసటి రోజు సోమవారం ఉదయం మహా సంప్రోక్షణ అనంతరం ఉదయం 10 గంటలకు ఆలయం తిరిగి తెరుస్తామని ఆయన తెలిపారు భక్తులు ఈ మార్పులు గమనించి సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం

- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- గన్నవరం : యూరియా అందని ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్ పద్మావతి తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'సగం మందికే యూరియా' కథనంపై ఆమె స్పందించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలో ఇంకా యూరియా అందని ప్రతి రైతుకూ స్టాక్ రాగానే అందజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ సొసైటీ పరిధిలో 3,300 ఎకరాలు సాగు భూమి ఉందన్నారు. ఇప్పటి వరకు పిఎసిఎస్ కు కు 98 మెట్రిక్ టన్స్ యూరియా సరఫరా చేశామని, సొసైటీ పరిధిలో సుమారు 1500 మంది రైతులు ఉన్నారనీ, ఇప్పటికీ సుమారు 900 మంది రైతులకు వచ్చిన యూరియా ను సరఫరా చేశామన్నారు. సొసైటీకి వచ్చిన సరుకును సాధ్యమై నంత ఎక్కువ మంది రైతులకు అందే విధంగా 1-2 యూరియా కట్టలు పంపిణీ చేస్తున్నారని వివరించారు. ఇప్పటివరకు అసలు యూరియా తీసుకోని రైతులకు రాబోయే యూరియా స్టాక్ లో పంపిణీ చేస్తామన్నారు. వీరపనేని గూడెం సొసైటీకి యూరియా స్టాక్ కావాలని ఇండెంట్ పెట్టామన్నారు.



కంప్యూటర్ అందిస్తున్న దృశ్యం

పాఠశాలకు కంప్యూటర్ అందజేత

ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్‌కు సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఏలేశ్వరపు ప్రశాంత్ (ఫ్రీలాన్సర్) చొరవతో స్నేహితులు అందరూ కలిసి 50 వేల రూపాయల విలువ గల కంప్యూటర్‌ను బహుకరించారు. సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అక్కినేని భాను ప్రసాద్ (యూ.కే) 14 వేల రూపాయలు, సాఫ్ట్ వేర్ ఆర్కిటెక్ బొడ్డు అనిల్ కుమార్ (యూఎస్ఏ) సాఫ్ట్వేర్ కన్సల్టెంట్ బండారు వెంకట్ (యూఎస్ఏ) ఏలేశ్వరపు ప్రశాంత్ (కూచిపూడి), 12 వేల రూపాయలు చొప్పున సేకరించి మొత్తం 50 వేల రూపాయలతో పాఠశాలకు కంప్యూటర్‌ను అందజేశారు. వీరిని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అమిరెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బందం అభినందించారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి కొత్తపేట గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలలో భాగంగా జరిగిన అన్న సంతర్పణ కార్యక్రమానికి ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు 50 వేల రూపాయలు విరాళం శనివారం అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాలకు, పేద విద్యార్థుల చదువుకు, పేద రోగుల వైద్యానికి సహాయం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సొంటి కిషోర్, రాజులపాటి శ్రీనివాస్, యరగాని రత్తయ్య, బెజవాడ చంద్రశేఖర్, బోయపాటి తారక రామారావు కెల్లా రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ పొట్లూరి బసవ రావు, ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబుకు, కొత్తపేట గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ అభినందనలు తెలిపారు.



విరాళం అందిస్తున్న దృశ్యం



ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-విస్సన్నపేట

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల దిగుమతి సరుకులపై 50 శాంత సుంకాల పెంపు నిర్ణయం తీసుకోడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం విస్సన్నపేటలోని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం విస్సన్నపేట మండల కార్యదర్శి విస్సంపల్లి నాగరాజు మాట్లాడుతూ.. ట్రంప్ విధానాల వల్ల రాష్ట్ర ఆక్వా, టైక్స్‌టైల్స్, గార్మెంట్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. ట్రంప్ సర్కార్ భారత ప్రయోజనాలను, సార్వభౌమత్వాని దెబ్బతీస్తున్నా కేంద్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం కమిటీ సభ్యులు పులిబల్ల ఏడుకొండలు చిట్టిబాబు సిఐటియు మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు గంజినబోయిన రాము ఎస్ కే భాష వెంకటేశ్వరరావు షమీవుల తదితరులు పాల్గొన్నారు.



వృత్తి విద్యా శిక్షణలో కెఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రానికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

మండలంలోని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రానికి జోన్ 10లో వృత్తి విద్యా శిక్షణలో ఒకటో స్థానం లభించినట్లు డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.రవి కిషోర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక అనుప్రయోగ సంస్థ (అటారి జోన్-10) హైదరాబాద్ 2024-25 వార్షిక సంవత్సరానికి వార్షిక జోనల్ వర్క్‌షాప్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో ఈ నెల 2 నుండి 4వ తేదీ వరకు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలో ఉన్న 72 కృషి విజ్ఞాన కేంద్రాలు, వాటి యొక్క 2024 - 25 వార్షిక ప్రగతి, వారి జిల్లాలలో సాంకేతిక పనితీరు ఈ కార్యక్రమంలో వివరించారు. గ్రామీణ రైతులు, మహిళల సుస్థిర జీవనోపాధి మెరుగుపరుచుటకు పెరటి కోళ్ల పెంపకంకు చేసిన కృషికి ప్రశంస పత్రాన్ని ఆటారీ జోన్- 10 డైరెక్టర్ షైక్.ఎన్. మీరా, వివిధ రాష్ట్రాల ఉపకులపతులు, చేతుల మీదగా అందించినట్లు తెలిపారు.

గుండెపోటుతో బిఎస్‌పి నాయకులు ప్రభుదాస్ మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

జగ్గయ్యపేట చిట్యాల గ్రామానికి చెందిన బిఎస్‌పి నాయకులు కొదమల ప్రభుదాస్ (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె కలరు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి, కెడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్ ప్రభుదాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేసిన ప్రభుదాస్ లాంటి నాయకుని కోల్పోవడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.

యూరియా కోసం రైతుల అగచాట్లు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణం కోదాడ రోడ్డులో గల గోపాలకృష్ణ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ యూరియాని శనివారం జగ్గయ్యపేట పట్టణం, వేదాద్రి, జయంతి పురం, బూదవాడ 4 గ్రామాల రైతులకు అధికారులు పంపిణీ చేయాలని నిర్ణయించారు. యూరియా కొరత ఉంటుందనే సోషల్ మీడియా కథనాలలో ఆందోళన చెందిన షేర్ మహమ్మద్ పేట, అనుమంచిపల్లి, గండ్రాయి, తక్కెళ్ళపాడు గ్రామ రైతులకు సొసైటీ వద్ద బారులు తీరారు. రైతులందరికీ ఆదివారం అందుతుందని అధికారులు చెప్పినప్పటికి రైతులు వెనక్కి తగ్గలేదు. హామాలీలు సరిపడ లేకపోవడంతో రైతులే యూరియా బస్తాలను మోసుకొచ్చారు. యూరియాను ఎక్కడెక్కడ పంపిణీ చేయాలి, ఏ సమయంలో అందిస్తారో సమాచారం అందిస్తామని, ఆ సమాచారం ఆధారంగా యూరియాని తీసుకెళ్లాలని అధికారులు రైతులకు తెలిపారు. రైతులందరికి యూరియాని ప్రభుత్వం అందిస్తుందని విజ్ఞప్తి చేశారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం : వైసిపి

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలమైందని వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. గోపాలకృష్ణ సొసైటీలో యూరియా పంపిణీ చేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకొని రైతులు సొసైటీ వద్ద చేరుకున్నారని, అక్కడ అరకొరగా యూరియా బస్తాలు కేటాయించడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. కౌలు రైతుల పరిస్థితి దారుణమని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి యూరియాని రైతులకు సరిపడేవిధంగా అందించాలని కోరారు.



యూరియా కోసం సొసైటీ వద్ద పడిగాపులు పడుతున్న రైతులు

బిగ్‌బాస్ తెలుగు భాగస్వామిగా హైయర్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మెజర్ అప్లయెన్సెస్ బ్రాండ్‌గా నిలిచిన హైయర్ అప్లయెన్సెస్ ఇండియా, ఈ ఏడాది కూడా ప్రేక్షకుల ముందు వెలుగులోకి వస్తోందని హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో సమావేశంలో వివరాలను తెలిపారు. బిగ్ బాస్ తెలుగు సీజన్ 9 కు అసోసియేట్ స్పాన్సర్‌గా హైయర్ మరోసారి ముందుకొచ్చిందన్నారు. దక్షిణ భారతదేశంలో అత్యంత ఆదరణ పొందిన ఈ రియాలిటీ షోతో భాగస్వామ్యం ద్వారా, తెలుగుభాషా ప్రేక్షకులతో తమ అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలనే హైయర్ సంకల్పాన్ని ఇది ప్రతిబింబి స్తోందన్నారు. ఈ భాగస్వామ్యంతో హైయర్ ఎల్ఈడి టీవీలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కండీషనర్లు బిగ్ బాస్ ఇంటి లోపల ప్రతిష్ఠాత్మకంగా ప్రదర్శించను న్నట్లు తెలిపారు.

వేగ జ్యూయలరీ మెగా ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ



నందిగామ వెంకటేశ్వర కల్యాణ మండపంలో శనివారం వేగజ్యూయలరీ మెగా ఎగ్జిబిషన్‌ను నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ “నగలు ఆడపడుచులకు అలంకారం మాత్రమే కాదు, అవి సంస్కృతి, సాంప్రదాయం, సౌందర్యానికి ప్రతీక అని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా స్త్రీలకు విభిన్న డిజైన్లలో నగలను అందించడం అభినందనీయమన్నారు. మెగా ఎగ్జిబిషన్‌లో సాంప్రదాయ, ఆధునిక డిజైన్లతో కూడిన బంగారు, వజ్ర, వెండి నగలు, ఇతర విలువైన ఆభరణాలు ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. వేగ జ్యూయలరీ నిర్వాహకులు, ఈ ఎగ్జిబిషన్‌లో నాణ్యమైన ఆభరణాలతోపాటు ఆకర్షణీయమైన ఆఫర్లనూ అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.

పశువులను వధించొద్దని వినతి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : స్థానిక శక్తి నగర్ సెయింట్ జేవియర్ స్కూల్ వెనుక వీధిలో పశువులను వధించి విక్రయించడం ఆపాలని స్థానికులు కోరుతున్నారు. డ్రెయినేజీల్లో పశువుల వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు పారకుండా నిలిచిపోతుందని తెలిపారు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని, పిల్లలు, పెద్దలు విష జ్వరాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కొద్ది రోజుల క్రితం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించినా ఫలితం కనిపించలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలని ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె శ్రీదేవి డిమాండ్ చేశారు. కొండపల్లి ఖిల్లా రోడ్డులోని యలమంచల వెంకటేశ్వరరావు, కమలమ్మ భవన్ మహిళా సంఘం ఐద్వా కార్యాలయంలో ఐద్వా 20వ పట్టణ మహాసభ శనివారం జరిగింది. ఐద్వా పట్టణ అధ్యక్షురాలు ఎల్ పార్వతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పించాలని, మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా మరింత ఆర్థిక స్వావలంబన సాధికారిక పెంచాలని, మహిళల భద్రత పెంపు కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో



ఐద్వా కొండపల్లి ప్రధాన కార్యదర్శిగా లింగాల పార్వతి, అధ్యక్షురాలుగా కె బేబీ సరోజిని, కోశాధికారిగా బి రామ సీతా, ఉపాధ్యక్షరాలుగా పి నవీన, సహాయ కార్యదర్శిగా ఎస్‌కె ఆహిషా, కమిటీ సభ్యులుగా ఎస్‌కె మౌలాబి, ఇ.దుర్గా, ఎన్ లక్ష్మీ, సామాల వెంకట్రావమ్మ, కె.రమణ, జె.పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, కె.నారాయణ, ఎస్‌కె బాషా, కె శివ కోటేశ్వరరావు, బి దేవుళ్ళు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్పందనకు పతకం

ప్రజాశక్తి- నందిగామ

జార్ఖండ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో నందిగామకు చెందిన గోనెల స్పందన 84 కిలోల విభాగంలో రెండవ స్థానం సాధించి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి రామారావు మాట్లాడుతూ తమ కుమార్తె స్పందన జాతీయ స్థాయిలో రెండవ స్థానం సాధించి సిల్వర్ మెడల్ గెలుపొందడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మున్ముందు మరెన్నో పతకాలు సాధించాలని స్పందనను అభినందించారు.

పెద్దవరం సొసైటిలో భారీ కుభంకోణం

రూ.2 కోట్లు స్వాహా ?

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం పెద్దవరం గ్రామ సొసైటీ అవినీతి కుంభకోణం వెలుగులోకి వచ్చింది. సొసైటీ కార్యదర్శి గుణ్ణం ఎల్లారెడ్డి రైతులు కట్టిన రుణాలకు దొంగ బిల్లులు ఇచ్చి రూ.2 కోట్లు కాజేసినట్లు ఆరోపణలు రావడంతో కెడిసిసి బ్యాంకు విజిలెన్స్ అధికారులు శుక్ర, శనివారాల్లో విచారణ చేశారు. దీంతో అవినీతి కుంభకోణం బయటపడింది. పెద్ద సొసైటీ పరిదిలో పెద్దవరం, చెరువు కొమ్ము పాలెం, బెల్లంకొండ వారి పాలెం గ్రామాలు ఉన్నారు. పెద్ద వరం సొసైటీ ప్రతి సంవత్సరం రూ.9 కోట్ల నుండి పది కోట్ల రూపాయల టర్నోవర్ ఉంది. ఈ ఏడాది సహకార సంఘం ద్వారా రైతులకు దీర్ఘ కాలిక, స్వల్ప కాలిక రుణాలు కలిపి రూ.8 కోట్ల వరకు ఇచ్చారు. ఏటా రైతులు రుణ వాయిదాలు చెల్లిస్తుంటారు. కర్షకులు వాయిదాకు లక్ష రూపాయలు చెల్లిస్తే ఆ మేరకు రైతులకు రసీదు ఇచ్చి సొసైటీ రికార్డుల్లో మాత్రం పదివేలు మాత్రమే చెల్లించినట్లు సొసైటీ కార్యదర్శి ఎల్లారెడ్డి జమ చేసినట్లు కెడిసిసి బ్యాంకు అధికారులు విచారణలో బయటపడింది. సొసైటీ కార్యదర్శి ఎల్లారెడ్డి 30 ఎళ్ళు గమస్తాగా పనిచేసి 2014లో సెక్రటరీగా ప్రమోషన్ పొందారు. ప్రమోషన్ వచ్చినా బదిలీ కాకుండా ఉన్నతస్థాయిలో పైరవీలు చేసుకుని పెద్ద వరం సొసైటీలోనే తిష్టవేశారు. సొసైటీలోని రెండు గదులను సొంత ఇళ్లుగా మార్చుకొని అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు పలువురు ఆరోపణలు వినవస్తున్నాయి. సొసైటీ కార్యదర్శి ఎప్పటి నుంచో దొంగ బిల్లులతో రైతులను మోసం చేస్తురని సమాచారం. అసిస్టెంట్ రిజిస్టర్ అజయ్ కుమార్ విచారణ చేపట్టారు. దీంతో కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్.. ఎల్లారెడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.



సొసైటీ సెక్రటరీని విచారిస్తున్న కెడిసిసి బ్యాంకు అధికారి

గుండెపోటుతో సిపిఎం సానుభూతిపరులు మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

గుండెపోటుతో ఇద్దరు సిపిఎం సానుభూతిపరులు శనివారం మృతి చెందారు. జగ్గయ్యపేట మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరులు, మాజీ వార్డు మెంబర్ కొజ్జా బ్రహ్మం (80) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ఒక కుమారుడు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అదేవిధంగా సిపిఎం సానుభూతిపరాలు సంపసాల లింగమ్మ (75) గుండెపోటుతో మృతి చెందారు. ఆమె కుమారుడు సంపసాల లింగయ్య పార్టీ సభ్యులుగా ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు కాకనబోయిన లింగారావు, కోటా కష్ణ, సోమోజు రామనాథం, తదితరులు వారి మృదేహాలను సందర్శించి నివాళు లర్పించారు.

యూరియా సరఫరా పరిశీలన



యూరియాపై రైతులతో మాట్లాడుతున్న అధికారిణి పద్మావతి

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్/ఉయ్యూరు : కృష్ణా జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎన్ పద్మావతి ఉయ్యూరు మండలంలోని ఆకునూరులో యూరియా సరఫరా, గూడూరు మండలం ఆకుల మన్నాడు పిఎసిఎస్‌లో యూరియా సరఫరా ప్రక్రియను శనివారం పర్యవేక్షించారు. వీరితో బాటు వ్యవ సాయ కమీషనరు కార్యాలయం గుంటూరు నుండి వ్యవసాయ ఉపసంచాలకులు ఎన్.సిహెచ్ బాలూనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు గత 5 రోజులలో 3150 మె టన్నులు యూరియా వచ్చిందని, రెండు రోజులలో 1300 మెట్రిక్ టన్నులు యూరియా వస్తుందన్నారు. రాబోయే రోజులలో ఇంకా యూరియా స్టాకు వస్తుందని రైతులెవ్వరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. **ప్రజాశక్తి-పామర్రు** : రైతు సేవా కేంద్రం ద్వారా రాష్ట్రంలోనే మొదటిగా పామర్రులో రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. రైతులకు యూరియా అందు బాటులో లేని నేపథ్యంలో పిఎసిఎస్ లు,ఆర్ఎస్‌కేలు పరిశీలన చేయటంలో భాగంగా పామర్రు మార్కెట్ యార్డులోని రైతు సేవ కేంద్రం వద్ద ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. కష్ణాజిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు,రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : బంటుమిల్లి రైతుసహకార సంఘ కార్యాలయం వద్ద బంటుమిల్లి, పెందుర్రు, ములపర్రు ,మలపరాజగూడెం ఆముదాలపల్లి, మల్లేశ్వరం, కొర్లపాడు తదితర గ్రామ రైతులకు యూరియాను ఒక కట్టా చొప్పున అందించారు. బంటుమిల్లి మండల ఇంచార్జ్ తహసీల్దార్ కాగిత పూర్ణచంద్రరావు , బంటుమిల్లి రెవిన్యూ అధికారి బత్తుల శివశంకర్ తదితరులు ఆధ్వర్యంలో ఎరువులను పోలీస్ వారి సహకారంతో రైతులకు అందించారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతుసంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, సిఐటియు నాయకులు మాజేటి శీనివాసరావు వ్యవసాయ ఎడిఏని ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీ చేస్తే రైతాంగానికి సౌలభ్యం గా ఉంటుందని కోరారు.

యూరియా పంపిణీలో విమర్శలకు తావివ్వొద్దు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : యూరియా పంపిణీ కార్యక్రమా ల్లో కూటమి నాయకులు పాల్గొని విమర్శలకు తావివ్వరాదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ రైతులకు యూరియా అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యంలో యూరియా విక్రయాలు సజావుగా నియమ నిబంధనల ప్రకారం జరిగేలా కృషి చేస్తున్న అధికారులకు కూటమి నాయకులు సహకరించాలని కోరారు. యూరియా విక్రయాల సమయంలో ఆయా కేంద్రాల వద్ద క్యూ లైన్ లో ఉండే రైతులకు సహకార సంఘాల అధ్యక్షులు ఆధ్వర్యంలో నీడనిచ్చే షామీయానాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేయాలని బుద్ధ ప్రసాద్ సూచించారు.


యూరియాపై ఆందోళన వద్దు : ఎడిఎ

ప్రజాశక్తి ఉయ్యూరు : రైతులకు అవసరమైన యూరి యా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు రోజుల్లో మండల పరిధిలో పీఏసీఎస్లకు తగినన్ని యూరియా లోడులు వస్తున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని గన్నవరం ఏడీఏ సునీల్ తెలిపారు. ఆకునూరు రైతు సహాయ కేంద్రానికి శనివారం 15 టన్నుల యూరియా రాగా ఎకరాకు అరకట్ట చొప్పున రైతులకు పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదఓగిరాల, చినఓగిరాల, గండిగుంట, వీరవల్లి మోఖాసా, బొల్లపాడు, సాయిపురం పీఏసీఎస్ల కు 15 టన్నుల చొప్పున యూరియా వస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన మేర యూరియా పీఏసీఎస్ ద్వారా పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.



ఎఎన్ఎం స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-పామర్రు : ఎఎన్ఎం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ పూర్ణచం ద్రారెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సంస్థలో ఎక్కువ కాలంగా పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఝాన్సీ, కిరణ్మయి, దాశరథి బాబుని ప్రిన్సిపల్ సత్కరించారు.





ఉత్తమ టీచర్లను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్తమ టీచర్లకు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం : వీరపనేనిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో శనివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై. యశోద లక్ష్మి , జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న టీచర్ సరళ ను కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, ఉపాధ్యా యేతర సిబ్బంది విద్యార్థులు ఘనంగా సత్కరిం చారు. కాంప్లెక్స్ చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, వీరపనేనిగూడెం జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : మండలంలోని ఉత్తమ సేవలను కనబరిచిన నలుగురు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాత్రి మచిలీపట్నంలో జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులను జేసీ గీతాంజలి శర్మ చేతుల మీదుగా అందించారు. ఈ విషయాన్ని ఎంఈఓలు జి.జగన్ మోహన్‌రావు, జి.గోపాలరావు విలేకరులకు శనివారం తెలిపారు. మండలంలోని పెదపాలానికి చెందిన టి.సురేష్, చంద్రాలకు చెందిన ఎం.రత్నం, గుడ్లవల్లేరుకు చెందిన వరలక్ష్మి, అంగలూరుకు చెందిన మేరీ రోజీనాకి అవార్డులను అందించినట్లు ఎంఈఓలు చెప్పారు.

అధ్యాపకులకు సన్మానం

ప్రజాశక్తి-గన్నవరం : విద్యార్థుల జీవితాల్లో చదువు అనే వెలుగు నింపేది గురువులేనని వి.కె.ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం కళాశాల సెమినార్ హాలులో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువుల అభినందన సన్మాన కార్యక్రమం జరిగింది. పదిమంది అధ్యాపకులను ఘనంగా సన్మానించి తమ అభిమానం చాటు కున్నారు. అధ్యాపకులు నవీన్, బాల చంద్రుడు, రాంబాబు, తేజ కుమారి, దుర్గ భవాని, ప్రమీలారాణి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-తోటవల్లూరు : మండలంలోని బద్రిరాజు పాలెం గ్రామంలో అంగన్వాడి ఆధ్వర్యంలో కిషోర బాలికలకు అన్ని అంశాలపై అవగాహన కలిగించేందుకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దేవరపల్లి సెక్టార్ సూపర్వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు ఆహార అలవాట్లు, ఆరోగ్యం పట్ల వారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. పోక్సో చట్టం పనితీరును తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బ్యానజీర్ సుల్తానా, ఫణీంద్ర, కుసుమ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ మీనాక్షి,ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : కిషోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గన్నవరం ఐసిడిఎస్ సిడిపిఓ జి మంగమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి రోజు కనీసం మూడు నుండి నాలుగు లీటర్ల మంచినీటిని తాగాలని, ఆహారం లో మునగాకు, తోటకూర, బచ్చలకూర, మెంతుకూర లాంటివి తీసుకోవాలని అన్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిహెచ్ అనిత, ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు పద్మాదేవి, దుర్గాదేవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో కూచిపూడి సెక్టార్‌లోని కిశోర బాలికలకు పరిశుభ్రతపై పెదపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో శనివారం అవగాహన కల్పించారు. మొవ్వ సిడిపిఓ ఎస్ విశ్వనాథ ప్రసన్న. ముఖ్యఅతిథిగా పాల్గొనిఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయురాలు గీత, కూచిపూడి సెక్టార్ సూపర్వైజర్ ఏ ఎస్ కళ్యాణి, సిహెచ్ఓ కమల, ఏఎన్ఎం బుజ్జి పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : కౌమార్య దశలో వచ్చే మార్పుల వల్ల కిషోర్ బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్లు డి మేరీ, నసీర్ ఉన్నిసా లు వివరించారు. కిశోరి బాలిక సంకల్పంలో భాగంగా ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్ట్ పరిధిలోగల మండలంలోని డోకిపర్రు, అంగలూరు గ్రామాలలో పాఠశాలలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు పావని వెంకటలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ఉషారాణి, శివ నాగలక్ష్మి, నక్షత్రం, ఆశా వర్కర్లు కిషోర్ బాలికలు, తల్లులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పమిడిముక్కల** : ఆత్మస్థైర్యంతో బాలికలు బాగా చదువుకుని ముందుకు వెళ్లాలని అంగన్వాడి సూపర్వైజర్ ఉషా అన్నారు. శనివారం పమిడిముక్కల మండలంలోని ఐనాపూరు ఉన్నత పాఠశాలలో, పమిడిముక్కల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆడపిల్లలు చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐనాపూరు ఉన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయులు వేణుగోపాలరావు, పమిడిముక్కల అంగన్వాడి టీచర్ విజయనిర్మల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



తోట్లవల్లూరు మండలంలో...



ఉంగుటూరు మండలంలో...

పగిలిన పైపులైను

- మంచినీళ్లు రాక ఇబ్బందులు



మెయిన్ పైపుకు పడిన రంధ్రానికి చుట్టిన రబ్బరు టూబ్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం-ఆగిరిపల్లి రోడ్డు విస్తరణ పనులు సంగతి ఎలా ఉన్నా.. నెలరోజుల నుంచి మంచినీళ్లు రాక జనాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా తవ్వడంతో మంచినీటి పైపులైన్ పగిలిపోయింది. దాని స్థానంలో కొత్త పైపులైను నిర్మిం చారు. అయితే పైప్ లైన్ వేసిన తర్వాత దానిపై కంకర పోసి రోలర్ తొక్కడంతో మళ్లీ కొత్త పైపు పగిలింది. పలుచోట్ల అతుక్కు పోయింది. ఫలితంగా నీళ్లు వదిలిన జనానికి వెళ్లడం లేదు. మంచినీళ్లు రాక 50 కుటుంబాల వారు అగచాట్లు పడుతున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టి నాలుగు నెలలు దాటింది. ఇంకా మూడు నెలల పాటు జరుగుతాయని అంటున్నారు. అప్పటివరకు కొత్త పైపులైను మార్చడానికి వీల్లేదని పంచాయతీ అధికారులు అంటున్నారు. ఇప్పటికే లక్షల రూపాయలు ఖర్చయ్యాయని, అయినా వేసిన పైపు మొత్తం పాడైపోయిందని అంటున్నారు. పైపు పగిలిన చోట రబ్బరుతో అతుకులు వేస్తున్నారు. అతుక్కుపోయిన చోట కట్ చేసి జాయింట్ కలుపుతున్నారు. అయినా జాయింట్లు ఆగుతాయని నమ్మకం కనిపించడం లేదు. టైరు చుట్టిన మళ్లీ నీరు లీక్ అవుతుందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు సరైన అవగాహనతో పైపులైన్ వేయకుండా ఏదోతూ మంత్రంగా పనులు చేయడం వల్ల లక్షల రూపాయలు అవడమే కాకుండా ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పడం లేదని స్థానిక మహిళలు మండి పడుతున్నారు. ఇప్పటికైనా క్వాలిటీ పైప్ లైన్ నిర్మాణం చేసి మంచినీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మహిళలు రాజకీయంగా ఎదగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. శనివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ గా ఇటీవల నియమితురాలైన చల్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు స్వప్న దంపతులు బుద్ధ ప్రసాదును మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ మిషన్ డైరెక్టర్, మాజీ వైస్ ఎంపీపీ పోలేం నాగమణి, స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, చల్లపల్లి ఎంపీపీ కోట విజయ రాధిక, మాజీ ఎంపీపీ వన్డే కనకదుర్గ పాల్గొన్నారు

ఇమామ్, మౌజ్జాన్‌ల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - గుడివాడ : రాష్ట్రవ్యాప్తంగా ఇమామ్, మౌజ్జాన్ గౌరవ వేతనాల పెండింగ్ మొత్తాలను తక్షణం విడుదల చేయాలని వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖాశీం (అబు) పేర్కొన్నారు. శనివారం గుడివాడ వైసిపి కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇమామ్ లకు నెలకు రూ.10,000లు, మౌజ్జాన్ లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం నిరంతరంగా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, కానీ 2025 జనవరి నుండి చెల్లింపులు జరగలేదని ఫలితంగా 2025 సెప్టెంబర్ వరకు 8 నెలల గౌరవ వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంచారజాతుల రాష్ట్ర మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్ , మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కే అలీ సాహెబ్ (బాజీ) , గుడివాడ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు షేక్ షమ్ము, కరిముల్లా బేగ్ పాల్గొన్నారు.

యూరియా సమస్యకేదీ పరిష్కారం!

వీక్షణం

రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యపై పాలకులు చెబుతున్న మాటలకు పొంతన కుదరడం లేదు. అవసరమైన మేరకు యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నారు. అదునుకు అవసరమైన యూరియా అందించలేకపోవడతో పంటల దిగుబడులు తగ్గుతాయని ఆందోళన చెందుతున్నారు. జిల్లా అవసరాలకు తగిన మొత్తంలో ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతోనే రైతన్నలకు ఈ సీజన్‌లో యూరియా కష్టాలు తప్పడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించి సమస్యకు పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకోకుండా యూరియా కొరత లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పడం చర్చనీయాంశమవుతోంది.

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు కృష్ణాలో 3,55,824 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగయ్యాయి. నెలాఖరుకు సీజన్ ముగిసే నాటికి మరో ఎనిమిది వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఈ పంటలకు డిఏపి 10,500, ఎంఒపి 3,920, మిశ్రమ ఎరువులు 28,500, సూపర్ ఫాస్పెట్ 7,300, యూరియా 38,300 మెట్రిక్ టన్నులు అవసరమని గత ఏడాది వినియోగాన్ని ప్రామాణికంగా తీసుకుని వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. యూరియా వినియోగం ప్రతి ఏటా ఐదు నుంచి పది శాతం పెరుగుతుంది. దీనికి విరుద్ధంగా ఈ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరాలో ప్రభుత్వం కోత పెట్టింది. ఇప్పటి వరకు 30, 286 టన్నులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. అవసరమైన మొత్తానికన్నా ప్రభుత్వం 8,044 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరాను తగ్గించింది.

ఎరువుల వినియోగంలో భూ సారం, వాతావరణ పరిస్థితులు కీలకం. డెల్టా ప్రాంతంలోని సారవంతమైన నల్లరేగడి భూముల్లో పంటకు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మొత్తంలోనే ఎరువులు వినియోగిస్తారు. వరిలో ఎకరాకు 50 కిలోల డిఏపి, మూడు దఫాలుగా 75 కిలోలు యూరియా, రెండు దఫాలుగా 30 కిలోలు పొటాష్ వినియోగిస్తారు. ఈ సీజన్ ప్రారంభంలోనే భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. మరోపక్క ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో పంటల ఎదుగుదలకు అవసరమైన నత్రజని ఎరువులను రైతులు అధికంగా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎర్ర నేలలు, ఇసుక, చౌడు భూములు, చెరకు, పసుపు, కంద, తమలపాకు, కూరగాయలు తదితర ఉద్యాన పంటలకు ఎక్కువ మొత్తంలో యూరియా వినియోగించాలి. అవసరమైన మేర యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటల దిగుబడులు తగ్గి నష్టపోవాల్సి వస్తుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. అవసరమైన ఎరువులను అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుతున్నారు.

డిఎస్ఆర్‌వి ప్రసాద్



ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో కెఎల్‌యుకు జాతీయ స్థాయిలో 26వ ర్యాంకు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటించే యూనివర్సిటీలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఇచ్చే ర్యాంకింగ్‌లలో కెఎల్ యూనివర్సిటీ 26వ ర్యాంకు దక్కించుకుందని యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారథివర్మ తెలిపారు. విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యా ప్రణాళిక, మౌలిక వసతులు, నాణ్యతా, నైపుణ్యం వంటి ప్రమాణాలు, పరిశోధన ప్రాజెక్ట్, ప్లేస్‌మెంట్స్, పిహెచ్‌డి పొందిన ప్రొఫెసర్స్ వంటి అంశాలను ప్రామానికంగా తీసుకుని ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ ఇస్తారని... ఈ అంశాలలో తమ యూనివర్సిటీ అత్యుత్తమంగా ఉందని తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఇంజనీరింగ్‌లో 35, ఓవరాల్ కేటగిరిలో 46వ ర్యాంకు, మేనేజ్మెంట్ విభాగంలో 70వ ర్యాంకు వచ్చిందని, జాతీయ స్థాయిలో అన్ని రకాల ర్యాంకులలో టాప్‌లో ఉన్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో నైపుణ్యాలను పెంపొందించటం యూనివర్సిటీ విద్యా ప్రణాళికలో ప్రధాన లక్ష్యమని తెలిపారు. పరిశోధనలు, నూతన ఆవిష్కరణల వంటి అంశాలలో యూనివర్సిటీ గణనీయమైన ప్రగతి సాధిస్తోందని హర్షం వ్యక్తం చేశారు.

విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు రాముడు ఎంపిక

ప్రజాశక్తి-మైలవరం

స్థానిక లక్కిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జె.రాముడు ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఐఎన్ఎస్ఎ విజిటింగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రోగ్రాం ద్వారా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్లాంట్ సైన్సెస్ డిపార్ట్మెంట్‌లో ఒక నెల కోలాబరేటివ్గా రీసెర్చ్ వర్క్ చేయడానికి అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఎం శ్రీనివాసరావు, తదితరులు రాముడిని అభినందించారు.

బాదంలో చక్కని పోషక విలువలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మంచి ఆరోగ్యానికి సమతుల్య ఆహారం చాలా ముఖ్యం. అని, బాదం చక్కని పోషక విలువలను అందిస్తుందని ప్రముఖ పోషకాహార నిపుణులు డాక్టర్ ఎం.ప్రవీణ్ అన్నారు. నగరంలోని మెడికల్ భవన్ నంది ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బాదం, పండ్లు, తృణధాన్యాలు వంటి పోషకాలు నిండిన ఆహారాలతో రోజును ప్రారంభించడం శక్తి, శ్రేయస్సులను పెంపొందిస్తుందని తెలిపారు. జింక్, మెగ్నీషియం, ఐరన్, విటమిన్ ఇతో సహ 15 ముఖ్యమైన పోషకాలతో సుసంపన్నమైన కాలిఫోర్నియా బాదం, ఉదయం వేళ శక్తిని తోడ్పడుతుందని అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఆహార మార్గదర్శకాలను విడుదల చేసిందని తెలిపారు. ఇది మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినవలసిన నట్స్‌లో బాదంను ఒకటిగా గుర్తించిందని తెలిపారు. ప్రతిరోజూ బాదం తినడం బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడవచ్చని చెప్పారు.

స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు గిరాకీ

- కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

ప్రతి కుటుంబంలో ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి ఆలోచనలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ఎఐ ఫర్ షూర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ఆధునిక సాంకేతికతతో గ్లోబల్ మార్కెట్లో అమ్ముకాలు నిర్వహించుకొని.. ఆర్థిక ప్రగతి సాధించేందుకు అడుగులు ముందుకు వేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రంలో డీఆర్‌డీఏ, మెప్మా, యూనిసీడీ సంయుక్త ఆధ్వర్యంలో ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త - ఎఐ ఫర్ షూర్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను గ్లోబల్ మార్కెట్‌కు చేరువచేసుకునేందుకు ఆధునిక సాంకేతికతను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఎఐ నిపుణులతో 160 మంది స్వయం సహాయక సంఘాల మహిళా వ్యాపారవేత్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. చాట్‌జీపీటీ వంటి వాటి సహాయంతో బ్రోచర్లు, ఫ్లయర్లు, బ్యానర్లు వంటి వాటిని తయారు చేసుకోవడం, రీల్స్, షార్ట్స్‌ను రూపొందించి వాటిని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. డిజిటల్ మార్కెటింగ్, ఈ- కామర్స్ అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయిపట్టి నడిపించడం జరుగుతోందని తెలిపారు. నిట్ - వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ స్ఫూర్తి మాట్లాడుతూ.. ఓ మంచి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.



శిక్షణా కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

నేడు దుర్గ గుడి మూసివేత...

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

చంద్ర గ్రహణం కారణంగా సెప్టెంబరు 7వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని ప్రధాన ఆలయం, ఉపాలయాలన్నింటినీ మూసివేస్తున్నట్లు దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు కవాట బంధనం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 8వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి తిరిగి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయవాడ

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్‌స్టాప్ సెంటర్ (విజయవాడ)లో అడ్మినిస్ట్రేటర్ ఒక పోస్టు, సైకో సోషల్ కౌన్సెలర్ ఒక పోస్టు భర్తీ చేసేందుకు గతేడాది అక్టోబర్ 16న నోటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందని.. ఇంటర్వ్యూలో ఎవరూ అర్హత సాధించనందున తిరిగి నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టు లేదా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు స్థానిక అర్హులైన 18 నుండి 42 సంవత్సరాల వయసు కలిగిన మహిళా అభ్యర్థులు నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలకు ఐదేళ్ళ, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ట వయసులో సడలింపు ఉంటుందన్నారు. సెప్టెంబర్ 9 వరకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ntr.ap.gov.in నుండి దరఖాస్తులు డౌన్లోడు చేసుకొని.. పూర్తిచేసి, ధ్రువీకరణ పత్రాల నకళ్లను గజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి.. ఆ దరఖాస్తులను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వారి కార్యాలయం, గద్దె పూర్ణచంద్రరావు వీధి, మారుతీనగర్ సెకండ్ లేన్, విజయవాడ కార్యాలయంలో అభ్యర్థులు స్వయంగా సమర్పించాలని తెలిపారు.

ఆర్చరీలో నాగసాయి ప్రపంచ రికార్డు

- ఘనంగా సత్కరించిన ఐకాన్ పబ్లిక్ స్కూల్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

తెలుగువారి క్రీడా ప్రతిభను ప్రపంచానికి చాటుతూ, ఆర్చరీలో ప్రపంచ రికార్డు సష్టించిన బి. షణ్ముఖ నాగసాయిని ఐకాన్ స్కూల్ తరపున సత్కరించుకోవడం మాకెంతో గర్వకారణంగా ఉందని ఐకాన్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, క్రెడాయ్ మాజీ అధ్యక్షులు కొండిశెట్టి రాజేంద్ర అన్నారు. శనివారం ఐకాన్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో విలువిద్య క్రీడాకారిణి బుద్దె షణ్ముఖ వెంకట నాగసాయి ప్రతిభను ప్రోత్సహిస్తూ ఘనంగా సత్కరించి, ఆర్థికసాయమందించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ యడ్ల స్వరూప మాట్లాడుతూ విద్యార్థుల్లో, యువతలో స్ఫూర్తిని నింపేలా ఈ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించామని, విజయవాడ నుంచి మరింత క్రీడాకారులు రాణించాలన్నారు. షణ్ముఖ సాయి మరిన్ని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.

షణ్ముఖ ట్రాక్ రికార్డు : 2025లో సింగ పూర్‌లో నిర్వహించిన ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో ఇండివిడ్యువల్, మిక్స్‌డ్, టీమ్ ఈవెంట్స్ 3 సిల్వర్ మెడల్స్ సాధించింది. ఆ తర్వాత అండర్ 21లో 2025 సింగపూర్ టోర్నమెంట్‌లో 2 వరల్డ్ రికార్డ్స్ సాధించింది. మొత్తంగా రెండు వరల్డ్ రికార్డ్స్, మూడు ఇంటర్నేషనల్ మెడల్స్, పలు రకాల ఈవెంట్స్ అనేక మెడల్స్ సాధించి దేశానికి, తెలుగు వారికి గర్వకారణంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఐకాన్ స్కూల్ ప్రిన్సిపల్ పి. వి ప్రవీణ్, టి.ఆర్.కె సింగ్, క్రీడాకారిణి తల్లిదండ్రులు వేణుగోపాల్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

